

రామాలయంలో విశేష హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపైనున్న రామాలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు.

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	35.3/27.5

రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం తెలిపారు.



ముగిసిన క్రీడా శిబిరాలు

విశాఖ స్పోర్ట్స్: వాల్తేర్ రైల్వే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మోదకొండమ్మ సన్నిధిలో మాడుగుల మహరాణి



మాడుగుల మోదమాంబను దర్శించుకుంటున్న మయాంక్ కుమారీదేవి

మాడుగుల: మోదకొండమ్మ అమ్మవారిని మాడుగుల మహరాణి మయాంక్ కుమారీదేవి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. అమ్మవారి జాతర వచ్చే నెల 3వ తేదీన జరగనున్న దృష్ట్యా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుమారీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి, ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడినాయుడు, నూతన ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు

అనకాపల్లి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు జూన్ 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సుల్లో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత చెంది, ఇంటర్మీడియట్ కోర్సు పూర్తి కాని విద్యార్థినీ విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు కోసం www.angrau.ae.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఆర్ఏఆర్ఎస్ పనివేళల్లో సెల్‌ఫోన్ నంబర్లు 8331070288, 9966244225లను సంప్రదించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ భవనంపై కూలిన భారీ చింత చెట్టు

- పాక్షికంగా దెబ్బతిన్న కారు



శంభువానిపాలెంలో కారు, అంగన్‌వాడీ కేంద్రంపై కూలిన భారీ చింత చెట్టు

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి రైవాడ పంచాయతీ శివారు శంభువానిపాలెంలో భారీ చింత చెట్టు.. పక్కనే ఉన్న అంగన్‌వాడీ భవనంపై కూలింది. ఆ సమయంలో అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉండడం, పిల్లలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే చింత చెట్టు కింద పార్క్ చేసిన గ్రామానికి చెందిన నాయుడు కారు పాక్షికంగా దెబ్బతింది. గత రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంత పంట పొలాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడి ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు.

రీజినల్ లేబర్ కమిషనర్ చర్చలు వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సంబంధించి శుక్రవారం రీజినల్ లేబర్ కమిషనర్ నిర్వహించిన చర్చలు వాయిదా పడ్డాయి. ఈ సమావేశానికి కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు, యాజమాన్యం ప్రతినిధులు హాజరు కాలేదు. సమ్మె జరుగుతున్న నేపథ్యంలో చర్చలను వాయిదా వేయాలని యాజమాన్యం ఆర్ఎల్‌సీకి ఈ-మెయిల్ ద్వారా సమాచారం పంపింది. సమావేశానికి హాజరైన కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ..సమ్మె సమయంలో యాజమాన్యం 1,480 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించిందని ఆరోపించారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, భవిష్యత్తులో ఎవరినీ తొలగించకుండా చూడాలని వారు ఆర్ఎల్‌సీని కోరారు. దీనిపై స్పందించిన ఆర్ఎల్‌సీ సమావేశాన్ని జూన్ 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు ఎ. రమణ, ఎం. రవి, సోమరాజు, జాన్, ఆర్.టి. రాజు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ మనుగడ ప్రశ్నార్థకం

- ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న ఫ్యాక్టరీ
- ఏడాదిలో ఒక్క పైసా కూడా అందని ప్రభుత్వ సాయం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఫ్యాక్టరీకి రూ.89 కోట్ల సాయం

గోవాడ సహకార చక్కెర కర్మాగారం భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. వచ్చే క్రషింగ్ సీజన్ జరుగుతుందా లేదా అనే అనుమానాలు చుట్టుముడుతున్నాయి. అత్యధిక షేర్ కలిగిన ప్రభుత్వం ఫ్యాక్టరీని ఆదుకోవడంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో ఫ్యాక్టరీ నడుస్తుందా.. మూసేస్తారా అనే ఆందోళన రైతుల్లో నెలకొంది.



చోడవరం: రాష్ట్రంలో సహకార రంగంలో నడుస్తున్న ఏకైక సుగర్ ఫ్యాక్టరీ గోవాడ చక్కెర కర్మాగారం. మొత్తం 11 సుగర్ ఫ్యాక్టరీలు ఉండగా ఇప్పటికే 10 కర్మాగారాలను మూసివేశారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఒక వెలుగు వెలిగిన గోవాడ సుగర్స్.. గత చంద్రబాబు పాలనా కాలంలో కునారిల్లింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా మళ్లీ ఈ కర్మాగారానికి ఆర్థిక సాయం చేసి కొత్త ఊపిరులు ఊదారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీరుతో ఈ సుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి ప్రశ్నార్థకంగా తయారైంది. ఈ ఫ్యాక్టరీపై 23 వేల మంది చెరకు రైతులు, 2 వేల మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ సాయంలేక ఒకపక్క ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా.. మరోపక్క పాత మిషనరీ కావడంతో తరుచూ యాంత్రిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటీవల ముగిసిన సీజన్‌లో పలు మార్లు క్రషింగ్‌కు అంతరాయం కలిగి చివరికి లక్ష్యం చేరుకోలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.89 కోట్లను గ్రాంట్‌గా, వడ్డీ లేని రుణంగా ఎటువంటి షూరిటీ పెట్టుకోకుండా ఇచ్చి ఫ్యాక్టరీని ఆదుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ఒక్కపైసా కూడా ఫ్యాక్టరీకి గాని, రైతుల చెరకు బకాయిలకు గాని సాయం చేయలేదు. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో నిండా మునిగిపోయింది.

ప్రభుత్వం ఆదుకుంటేనే..

2024–25 సీజన్‌కు సంబంధించిన చెరకు రైతుల బకాయిలు, కార్మికుల బకాయి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఫ్యాక్టరీ ఉంది. వచ్చే సీజన్ క్రషింగ్ చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.35 కోట్ల సాయం చేయాల్సి ఉంది. లేకుంటే వచ్చే సీజన్‌ను ప్రారంభించే పరిస్థితి లేదు. అంతేకాకుండా పంచదార ఉత్పత్తితో పాటు ఉప ఉత్పత్తులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించి ఇథనాయిల్, డిస్టిలరీ పరిశ్రమలు నెలకొల్పాల్సి ఉంది. గత వైస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కేంద్రం సహకారంతో రూ.102 కోట్లతో ఇథనాయిల్ పరిశ్రమ పెట్టడానికి కావలసిన అన్ని అనుమతులు తీసుకోవడం, కొంత నిధులు కూడా మంజూరుకు సిద్ధం చేయడం జరిగింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. ఆ ప్రాజెక్టును ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవు. మరోపక్క డిస్టిలరీ పరిశ్రమకు రూ.300 కోట్లు తెస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే ఇటీవల ప్రకటించినా ఆ ప్రాజెక్టు కూడా ప్రకటనలకే పరిమితమైంది. కొత్త ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులు, నిధులు ఇవ్వడంతోపాటు నిలిచిపోయిన కో జనరేషన్ ప్లాంట్‌ను కూడా వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

సుమారు రూ.50 కోట్లు అత్యవసరంగా ప్రభుత్వం విడుదల చేస్తే.. వచ్చే సీజన్ క్రషింగ్‌తోపాటు ఓవరాయిలింగ్ పనులు కూడా జరిగి ఫ్యాక్టరీ గాడిలో పడే అవకాశం ఉంది. ఎన్నికల ముందు చెరకు రైతులను, సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటామని చెప్పిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇటువైపే చూడకపోవడంపై రైతులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ గార్లూ... ప్రభుత్వ సాయం ఏదీ ?

ప్రభుత్వ సాయం అందించి గోవాడ ఫ్యాక్టరీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు, తర్వాత చెప్పిన ఎంపీ సీఎం రమేష్, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, బండారు సత్యనారాయణమూర్తి ఇప్పుడు ఫ్యాక్టరీ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడంలేదు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలు, ఫ్యాక్టరీ నిర్వహణ ఖర్చులకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి తేలేకపోయారు. ఆర్థిక ఇబ్బందులతో ఓవరాయిలింగ్ పనుల్లో అవసరమైన మిషనరీలో మార్పు చేసుకోలేని పరిస్థితిలో ఉన్న ఫ్యాక్టరీకి ఎంపీ, ఎమ్మెల్యే ఒక్క పైసా కూడా ప్రభుత్వం నుంచి సాయంగా ఇప్పించలేకపోయారు. వీరి నిర్లక్ష్యం, అలసత్వం వల్లే ఫ్యాక్టరీకి ఈ దయనీయ దుస్థితి పట్టింది. క్రషింగ్ నిలిచిన సందర్భంలో రైతులు అనేకసార్లు రోడ్డు ఎక్కి ఆందోళనలు చేసినా ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి కనీస చర్యలు చేపట్టలేదు. ఫ్యాక్టరీని నష్టాల్లో చూపించి చివరికి మూసేయించాలన్న ఆలోచనలోనే ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం, యువజన విభాగంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన పలువురికి చోటు కల్పించారు. ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను, రాష్ట్ర యువజన విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా అంబటి నాగ వినాయక శైలేష్ (విశాఖ ఉత్తర)లను నియమించారు. వీరితో పాటుగా రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధిగా మహ్మద్ ఇమ్రాన్ (గాజువాక), రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శులుగా పోలిశెట్టి సురేష్ రాజ్ కుమార్ (పెందుర్తి), కొంగర మురళీకృష్ణ(రంపచోడవరం), రాష్ట్ర యువజన విభాగం సెక్రెటరీగా మలసాల కుమార్ రాజా (అనకాపల్లి), రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా చింతకాయల వరుణ్ (నర్సీపట్నం), మళ్ల శివ (విశాఖ ఉత్తర), ఉడుగు అచ్యుతరామరాజు (పాడేరు)ను నియమించారు. రాష్ట్ర మహిళా విభాగం సెక్రెటరీలుగా బోసు రామలక్ష్మి (విశాఖ ఉత్తర), కోనాల విజయ వినీత (విశాఖ పశ్చిమ), కంచర్ల శ్రీదేవి (గాజువాక), రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త సెక్రెటరీలుగా చుక్కా వరలక్ష్మి (విశాఖ పశ్చిమ), బొర్రా విజయలక్ష్మి (విశాఖ దక్షిణ)లను నియమించారు.

రేపు సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్

ఎంవీపీకాలనీ (విశాఖ): సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జూన్ 1న ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ ఎదురుగా ఉన్న పోలమాంబ ఫంక్షన్ హాలులో జరగనున్నాయి. ఈ మేరకు బ్రూస్ లీ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ చిన్నా ఓ ప్రకటనలో తెలిపారు. కొరియన్ చోటా ఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కొండ కోనల్లో పెళ్లి సందడి



నూతన వధూవరులకు తాళిబొట్లు అందిస్తున్న చినజీయర్‌స్వామి



వివాహానికి హాజరైన ఆదివాసీ నవ దంపతులు

- కృష్ణదేవిపేటలో 108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు
- తాళిబొట్లు అందించి ఆశీర్వదించిన చినజీయర్ స్వామి

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి నడయాడిన ఈ ప్రాంతంలో ఇంత పెద్ద ఎత్తున ఆదివాసీ సామూహిక వివాహాలు జరగడం చాలా ఆనందంగా ఉందని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. వికాస తరంగిణి–దానధర్మ సంస్థ ఆధ్వర్యంలో కృష్ణదేవిపేట గ్రామంలో శుక్రవారం 108 ఆదివాసీ గిరిజన జంటలకు సామూహిక వివాహం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 10 వేలమంది పాల్గొన్నారు. శ్రీమన్నారాయణ నామజపంతో కృష్ణదేవిపేట గ్రామం మార్మోగింది. చినజీయర్ స్వామి నూతన వధూవరులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తాను ఏనాడూ ఎవరి పెళ్లికి వెళ్లలేదని, ఇలా ఆదివాసీ సామూహిక వివాహాలకు హాజరుకావడం మొదటిసారని చెప్పారు. ఈరోజు శ్రీరాముడు జన్మించిన పునర్వసు నక్షత్రమని, మీరంతా సీతారాముల్లా ఆదర్శంగా దాంపత్య జీవితం గడపాలని ఆశీర్వదించారు. మీ బిడ్డలను దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. వికాస తరంగణి– దానధర్మ సంస్థ ప్రతి జంటకు మూడు గ్రాముల బంగారు మంగళ సూత్రాలు ఉచితంగా ఇవ్వడంలో సంస్థ మాజీ అధ్యక్షులు రమేష్‌గుప్త, మల్లయ్య కృషి ఎంతో ఉందని తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన 10 వేలమందికి భోజనాలు ఏర్పాటు చేశారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్ఐలు రామారావు, తారకేశ్వరరావు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అడ్డు తొలగించుకోవాలనే యువతి హత్య

- రెండేళ్ల తర్వాత కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్

-8లో

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి
- ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనకాపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల పెంపునకు పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీజేఏసీ) అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక న్యూకాలనీ పాలూరి చిదంబరం మెమోరియల్ హాల్లో శుక్రవారం రెవెన్యూ సహా వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వరకు ఉద్యోగులు మూడు పీఆర్సీలు కోల్పోయారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కూటమి ప్రభుత్వానికి నివేదిక పంపామని, త్వరలో శుభవార్త వస్తుందని ఎదురుచూస్తున్నామన్నారు. ప్రతి ఏడాది 10 వేల నుంచి 15 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని, వీరికి బకాయి పడ్డ రూ.6 వేల కోట్లను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఆయన కోరారు. ఉద్యోగులకు ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లు బకాయి ఉందని, వీఆర్‌వో గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1కు పదోన్నతి కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. 2023 జనవరి 1 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలన్నారు. ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య స్కీమ్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, రాష్ట్రంలో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే నగదు చెల్లించి వైద్యం పొందే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఉద్యోగులకు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించే వారని, పది సంవత్సరాలుగా ఇది జరగడం లేదన్నారు. ఉద్యోగులకు నేటి వరకూ డీఏ రూ.1100 కోట్లు, సరెండర్ లీవ్‌లు రూ.3 వేల కోట్లు, జీపీఎఫ్ రూ.500 కోట్లతో పాటు ఇతర అలవెన్సుల బకాయి ఉన్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం ఎంత బకాయి ఉందో పే స్లిప్‌పై నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్‌సీ జిల్లా కార్యదర్శి వై.శ్రీరామ్మూర్తి, అధ్యక్షుడు వి.రత్నం, జిల్లా నాయకులు వాసు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మోడలింగ్‌లో మెరిసిన విశాఖ చిన్నారి



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని బీవీకే స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల జినిషా అలికానా 'సూపర్ గ్లో జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్'గా ఎంపికైంది. ఈమె తండ్రి రాంబాబు అలికానా ఎయిర్ ఇండియాలో సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా, తల్లి కావ్య గృహిణి. జినిషా మొదటిసారిగా గాజువాకలో జరిగిన మెస్సీ ఈవెంట్‌లో తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత గోవాలో జరిగిన కార్యక్రమంలో 54 మంది పోటీదారుల్లో రెండో స్థానంలో నిలిచి తన సత్తా చాటింది. ఆగస్టులో వియత్నాంలో నిర్వహించే అంతర్జాతీయ పోటీకి జినిషా ఎంపికై నట్లు ఆమె తండ్రి రాంబాబు తెలిపారు. గోవా ఆడిషన్‌లో జినిషా నెమలి వేషధారణలో చేసిన ప్రదర్శన పలువురి ప్రశంసలు పొంది, ఆమెను ఫస్ట్ రన్నర‌ప్‌గా నిలబెట్టింది. వియత్నాంలో జరగనున్న పోటీలో జినిషా విజయం సాధించాలని ఆమె స్నేహితులు, ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు.

నచ్చిన చోట కొలువు కోసం పైరవీలు

- కూటమి ఎమ్మెల్యేల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు
- పోస్టు కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధం



కలెక్టర్ కార్యాలయం

మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు గడువు దగ్గర పడుతుండటంతో, తమకు నచ్చిన చోటకు పోస్టింగ్‌ల కోసం పైరవీలు ఊపందుకున్నాయి. కూటమి ప్రజా ప్రతినిధుల సిఫార్సులకోసం రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లోని కొంతమంది అధికారులు నిమగ్నమయ్యారు. నగరంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వారు అక్కడి నుంచి కదలకుండా ఉండేందుకు, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నగరంలో పోస్టింగ్‌లు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా భీమిలి, విశాఖ రూరల్, ఆనందపురం, పెందుర్తి, సీతమ్మధార తహసీల్దార్ పోస్టులకు మంచి డిమాండ్ ఉంది. వీటిని పొందేందుకు ఎంతైనా ఖర్చు చేసేందుకు ఆరుగురు సిద్ధపడినట్టు ప్రచారం జరుగుతోంది.

నిబంధనలివీ..

జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేయడం తెలిసిందే. ఒకే చోట ఐదేళ్లు పనిచేసిన వారికి స్థాన చలనం కల్పించాలి. మన్యం ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసిన వారికి బదిలీల్లో ప్రాధాన్యమివ్వాలి. ఒకే చోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయడమే కాకుండా అన్ని క్యాడర్లు, పోస్టుల్లో చేసిన సర్వీసును పరిగణనలోకి తీసుకుని, ఎంత కాలం ఒకే ప్రాంతంలో పని చేశారనేది లెక్కించాలి. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పనిచేసిన వారికి, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న ఉద్యోగులకు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే బదిలీల్లో ప్రాధాన్యమివ్వాలి.

రెవెన్యూలో సిఫార్సులకే పెద్దపీట?

ఉమ్మడి విశాఖలోని రెవెన్యూ శాఖలో అన్ని క్యాడర్లలో బదిలీలు విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ చేయాల్సి ఉంది. దీనిపై ఆయన ఇప్పటికే అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి కలెక్టర్లతో సమావేశమై చర్చించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర క్యాడర్ల బదిలీలపై తుది నిర్ణయం విశాఖ కలెక్టర్ తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఆయన కార్యాలయానికి 68 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. ఇవి కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి కూడా సిఫార్సు లేఖలు, ఫోన్లు వచ్చినట్లు సమాచారం. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లు విశాఖ జిల్లాలో పోస్టింగ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొంతమంది నచ్చిన చోట పోస్టింగ్‌ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఈనెల కూడా పప్పన్నం లేనట్టే!

- ఐదు నెలలుగా కందిపప్పు అందించని కూటమి ప్రభుత్వం
- 546 మెట్రిక్ టన్నుల సరఫరాకు ఎగనామం



అనకాపల్లి టౌన్: కందిపప్పు.. బలవర్ధకమైన ఆహార పదార్థం. చక్కగా ప్రొటీన్ అందిస్తుంది. అందుకే ధర ఎంతైనా కందిపప్పును కొంటారు. చౌకధరల దుకాణంలో కూడా దీనికే డిమాండ్ ఎక్కువ. అయితే గత ఐదు నెలలుగా రేషన్ షాపులలో కందిపప్పు, రాగులు, గోధుమ పిండి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. రాగులు, గోధుమల సంగతి పక్కన పెడితే కనీసం కందిపప్పును సరఫరా చేయడంలో కూడా ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ నెల కూడా కందిపప్పును అడగొద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 5,37,038 మంది కార్డుదారులకు 14,99,000 యూనిట్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెల 7652 మెట్రిక్ టన్నుల బియ్యం, 264 మెట్రిక్ టన్నుల పంచదార, 546 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 544 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి, 1628 మెట్రిక్ టన్నుల రాగులు సరఫరా చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవి నిలిచిపోయాయి. కొన్ని నెలలు అరకొరగా పంపిణీ చేసిన ప్రభుత్వం ఐదు నెలలుగా పూర్తిగా నిలిపివేసింది. పేదలకు నిత్యావసర వస్తువైన కందిపప్పును సరఫరా చేయలేని ప్రభుత్వం రాగులు, గోధుమ ఇంకేమి ఇస్తుందని కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరు చూస్తుంటే రేషన్‌షాపుల్లో కందిపప్పు పూర్తిగా కనబడదేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం అర కేజీ పంచదార ఇచ్చి చేతులు దులిపేసుకుంటోంది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర నాణ్యతను బట్టి 130 నుంచి 150 రూపాయలు పలుకుతుంది. కూటమి నేతలు అధికారంలోకి రాకముందు రేషన్ షాపులను బలోపేతం చేస్తామని నిత్యావసరాలైన బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి, రాగి పిండి తదితర వాటిని రాయితీపై అందజేస్తామని ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో ఒక్క నెల కూడా పూర్తి స్థాయిలో సరుకులు సరఫరా చేయకపోవడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పేదవాడు ప్రొటీన్ ఫుడ్‌కు దూరం



ప్రత్యేక కేంద్రాల ద్వారా సబ్సిడీ ధరకు కందిపప్పు పంపిణీ చేయాలి. పేదవాడికి కందిపప్పే పరమాన్నం. దీనిని సరఫరా చేయలేకపోవడం వలన పేదలు ప్రొటీన్ ఫుడ్‌కు దూరం అయినట్లే.

–కోన లక్ష్మణ్, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు

నాణ్యత కలిగిన బియ్యం ఇవ్వాలి



పేదలకు ఇచ్చే కందిపప్పును ప్రభుత్వం ఐదు నెలలుగా నిలిపివేయడం దారుణం. అలాగే నాణ్యత కలిగిన బియ్యం ఇస్తే బహిరంగ మార్కెట్‌లో కొనాల్సిన అవసరం ఉండదు.

–కొణతాల హరనాథ్‌బాబు, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్




సంద్రంలో సీతాకోకచిలుకలు

ఆశలు రేకెత్తించే వర్షం.. మేఘాలతో నిండిన విశాఖ తీరం.. ఈసారి పర్యాటకులను అద్భుతమైన దృశ్యంతో ఆకట్టుకుంది. సంద్రంలో అలలు తాకుతుంటే, సంప్రదాయ పడవలు ఒకదాని వెనుక ఒకటి కదులుతూ, వర్ణరంజితమైన సీతాకోక చిలుకల సమూహంలా దర్శనమిచ్చాయి. ఆకాశంలో మేఘాలు, నీటిలో పడవలు సృష్టించిన ఈ కమనీయ దృశ్యం కోస్టల్ బ్యాటర్ వద్ద పర్యాటకులను మంత్రముగ్ధులను చేసింది, వారి మనసులను ఆనందంతో నింపింది.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం

6న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖ సిటీ: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం జూన్ 6వ తేదీన జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు జీవీఎంసీ సర్వసభ్య సమావేశ మందిరంలో మేయర్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో చర్చించేందుకు 27 అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు.

అజెండాలోని కొన్ని ముఖ్యాంశాలు

విద్యుత్ విభాగం: ఆప్కోస్ విధానంలో పనిచేస్తున్న 31 మంది టెక్నికల్, నాన్-టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రికల్ హెల్పర్ల సేవలను 2025-26 సంవత్సరానికి పొడిగింపు..

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు: పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో 15 మెగావాట్ల ఫ్లోటింగ్/ల్యాండ్ బేస్డ్ సోలార్ ప్లాంట్ల అభివృద్ధి.

మామిడిని సహజంగా మగ్గించాలి


బయ్యవరంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్

కశింకోట: ఆరోగ్యం కోసం కోత కోసిన మామిడి కాయలను సహజంగా మగ్గించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకర్ రైతులకు సూచించారు. మండలంలోని బయ్యవరంలో శుక్రవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు పంటల సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతుల గురించి అధికారులు, శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్వానికి వచ్చిన తర్వాత మామిడి కాయలను కోసి సహజంగా మగ్గించాలన్నారు. పక్వానికి రాకుండా కాయలు కోసి విషపూరితమైన రసాయనాలు కలిగిన కాల్షియం కార్బైడ్ తదితర మందులు వాడి మగ్గించరాదన్నారు. ఇలా అసహజంగా మగ్గిన పండ్లు తినడం ఆరోగ్యకరం కాదన్నారు. ఇవి ఎక్కువ నిల్వ కూడా ఉండవన్నారు. మామిడి సాగులో అధికారులు సూచించిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఏటా ఆశించిన దిగుబడులు సాధించవచ్చునన్నారు. జీడిమామిడిలో యాజమాన్య పద్ధతులను వివరించారు. జిల్లా రిసోర్స్ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు సిహెచ్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విత్తనశుద్ధి పాటించి వరి సాగు చేపట్టాలన్నారు. భూమి సారవంతం కోసం ముందుగా పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు చల్లుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్యానవన విస్తరణ అధికారి ప్రవీణ మాట్లాడుతూ తమ శాఖ వద్ద కొబ్బరి, మామిడి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వర్షాల సమయంలో నాటుకోవాలని సూచించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు మాట్లాడుతూ సహజ సిద్ధమైన ఎరువులు వాడడం ద్వారా భూముల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునన్నారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి మాట్లాడుతూ పశుగ్రాసం సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు.

జూలై 9న గిరి ప్రదక్షిణ

ఏర్పాట్లపై దేవస్థానం ఈవో త్రినాథరావు సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహాచలం క్షేత్రంలో జూలై 9న గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుందని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఈవో వి. త్రినాథరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తామన్నారు. గిరి ప్రదక్షిణ ఉత్సవం నిర్వహణపై శుక్రవారం దేవస్థానం వైదికులు, ఇంజినీరింగ్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో ఈవో ముందస్తు సమీక్ష నిర్వహించారు. జూలై 9న 32 కిలోమీటర్ల సింహగిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు, అలాగే జూలై 10న ఆలయ ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొంటారని ఈవో అంచనా వేశారు.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

భక్తుల సౌకర్యార్థం కొండచుట్టూ స్టాల్స్, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు విషయంపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులకు ముందుగానే లేఖలు రాయాలని సూచించారు. జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. గిరి ప్రదక్షిణ ఉత్సవంలో దాతల సహకారం కూడా ఎంతో ముఖ్యమని ఈవో పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయాల కోసం జీవీఎంసీ సహకారం తీసుకుంటామన్నారు. సమావేశంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, డిప్యూటీ ఈవో ఎస్.రాధ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి, ఈఈ రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాసరావు, పంతం శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు కె.మూర్తి, రాజ్యలక్ష్మి, సునీల్, పద్మనాభరాజు, త్రిమూర్తులు, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

అడ్డు తొలగించుకోవాలనే యువతి హత్య

- రెండేళ్ల తర్వాత కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- సీఐ, ఎస్‌ఐలను అభినందించిన డీఎస్పీ విష్ణుస్వరూప్


హత్యకు గురైన ఎల్లబిల్లి దివ్య(ఫైల్)


కేసు వివరాలు వెల్లడిస్తున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

యలమంచిలి రూరల్: రెండేళ్ల క్రితం యలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బీపీసీఎల్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దారుణ హత్యకు గురైన యువతి ఎల్లబిల్లి దివ్య(20) హత్య కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. యువతిని హతమార్చి, పెట్రోల్ పోసి తగలబెట్టిన ఈ ఘటన అప్పట్లో జిల్లాలో సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. అయితే సరైన ఆధారాలు లేకపోవడంతో 25 నెలలుగా నిందితులను పోలీసులు పట్టుకోలేకపోయారు. ఇటీవల జిల్లా ఎస్పీ ఆదేశాలతో పెండింగ్ కేసుల దర్యాప్తుపై దృష్టి సారించిన యలమంచిలి సర్కిల్ పోలీసులు చాకచక్యంగా పలు సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకోగలిగారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ హత్య కేసును ఛేదించిన యలమంచిలి సీఐ ధనుంజయరావు, ట్రైనీ డీఎస్పీ కృష్ణ చైతన్య, యలమంచిలి పట్టణం, మునగపాక ఎస్‌ఐలు కె.సావిత్రి, పి.ప్రసాదరావులను పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ అభినందించారు. ఈ సందర్భంగా యలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను డీఎస్పీ మీడియాకు వెల్లడించారు.

అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన ఎల్లబిల్లి దివ్య(20) 2023 ఫిబ్రవరి 22న యలమంచిలి మున్సిపాలిటీ పరిధి ఎర్రవరం సమీపంలో దారుణ హత్యకు గురైంది. కాలిపోయిన ఆమె మృతదేహాన్ని గుర్తించిన ఎర్రవరం వీఆర్వో చేవేటి అప్పారావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొదట్లో ఆమె ఎవరనేది, ఎవరు హత్య చేశారో కూడా గుర్తించలేని పరిస్థితి ఉండడంతో వీఆర్వో ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని మృతదేహంగాను, గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్టు కేసు నమోదు చేశారు. హత్యకు గురైన మహిళను తొలుత ట్రాన్స్‌జెండర్‌గా కూడా భావించారు. ఆ తర్వాత హత్యకు గురైంది పూడిమడకకు చెందిన ఎల్లబిల్లి దివ్యగా తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హతురాలు యలమంచిలిలో పలువురు యువకులతో ఎక్కువగా తిరుగుతూ ఉండడంతో ఆమెతో పరిచయం ఉన్న చాలా మంది యువకులపై అనుమానంతో పోలీసులు విచారించారు. అయినా సరైన ఆధారాలు లభ్యం కాకపోవడంతో నిందితులను గుర్తించలేకపోయారు. ఇటీవల ఈ కేసు దర్యాప్తుపై దృష్టి సారించిన పోలీసులు పలు సాంకేతిక ఆధారాలతో యలమంచిలి ధర్మవరం సీపీ పేటకు చెందిన ప్రగడ రవితేజ(30), సెలంశెట్టి సాయికృష్ణ(20), కాకివాని వీధికి చెందిన బంగారి శివ(23)లను నిందితులుగా నిర్ధారణకు వచ్చారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించడంతో నిందితులు నేరాన్ని అంగీకరించారు.

వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేయడంతోనే..

దివ్యకు కేసులో ప్రధాన నిందితుడు ప్రగడ రవితేజకు రిలేషన్‌షిప్ ఉండేది. రవితేజ మరో అమ్మాయిని కూడా ప్రేమిస్తున్నాడు. ఆమెతో వివాహం కూడా నిశ్చయమైంది. ఈ విషయం తెలుసుకున్న దివ్య.. తనను వివాహం చేసుకోవాలని రవితేజను కోరింది. లేకపోతే ఇంటికి వచ్చి గొడవ చేస్తానని బెదిరించింది. దివ్యను వివాహం చేసుకోవడానికి ఇష్టం లేని రవితేజ ఆమెను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం రచించాడు. ఇందుకు స్నేహితులైన సెలంశెట్టి సాయికృష్ణ, బంగారి శివల సహాయం కోరాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం దివ్యను పిడిగుద్దులు గుద్ది, చాకుతో పొడిచి చంపారు. అక్కడితో ఆగకుండా మృతురాలి ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు. నిందితుల్లో ప్రగడ రవితేజ, సెలంశెట్టి సాయి కృష్ణలు యలమంచిలి రూరల్ పీఎస్‌లో గంజాయి చోరీ చేసిన కేసులో నిందితులుగా ఉన్నారు. మూడో నిందితుడు బంగారిశివపై కొట్లాట కేసు ఉంది. అంతేకాకుండా నిందితులు ముగ్గురూ గంజాయికి అలవాటు ఉందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకెవరూ నిందితులు లేరని పోలీసులు స్పష్టం చేశారు. నిందితులు ముగ్గురినీ శుక్రవారం రాత్రి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

కార్మికురాలి ప్రాణం విలువ రూ.2.5 లక్షలు

- కుటుంబ సభ్యులను మభ్యపెట్టి అరకొర సాయం
- సీపీఎం నాయకుడు అప్పలరాజు


విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎస్.రాయవరం: సాయి మెరైన్ పరిశ్రమలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కార్మికురాలికి రూ.2 లక్షల యాభై వేలు వెలకట్టి తల్లికి నష్టపరిహారం ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. పార్టీ నాయకులతో కలిసి అడ్డురోడ్డులో స్థానిక విలేకర్లతో ఆయన సమావేశమయ్యారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల బాలిక హులకా అనిత బుధవారం రాత్రి మృతి చెందిన సంగతి తెలిసిందే. బాలిక మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తం కావడంతో పంచనామాకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అయితే విశాఖలో మృతురాలి తల్లిదండ్రులను మభ్యపెట్టి ఆ నగదు ఇచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. బాలిక మృతికి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని, అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడే మెరుగైన వైద్యం అందించాల్సిన పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం చేసిందన్నారు. సకాలంలో వైద్యం అందిస్తే బాలిక మృతి చెందేది కాదన్నారు. పోలీసులు హత్యానేరంగా కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఎం.రాజేష్, చిరంజీవి, బాబ్జి తదితరులు ఉన్నారు.

10న విశాఖలో రాష్ట్రపతి పర్యటన


రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, గిరిజన వర్సిటీ వీసీ కట్టమణి

మహారాణిపేట: నగరంలో జూన్ 10వ తేదీన జరగనున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ టి.వి.కట్టిమణితో కలిసి వివిధ అంశాలపై సమీక్షించిన కలెక్టర్.. కార్యక్రమ నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రపతి జూన్ 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలుకు చేరుకుంటారు. అక్కడ జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమం అనంతరం, ఆమె రోడ్డు మార్గం ద్వారా విమానాశ్రయానికి చేరుకుని తిరిగి ప్రయాణం అవుతారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు మార్గంలో రానున్న నేపథ్యంలో సుందరీకరణ పనులు, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. జ్ఞానాపురం రైల్వే అండర్ పాస్ వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ఒకవేళ వర్షం పడినట్లయితే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాలు వరకు ఎలాంటి హోర్డింగులు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా తొలగించాలని సూచించారు. ఏయూ కన్వెన్షన్ హాలు వద్ద సీటింగ్ ఏర్పాట్లు, ప్రోటోకాల్ నిబంధనలు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న క్రమంలో ప్రత్యేక గ్రీన్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు మార్గంలో, ఏయూ కన్వెన్షన్ హాలు వద్ద పారిశుధ్య పరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు.విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బిహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, అధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా


బోల్తా పడిన కారు

మాకవరపాలెం: రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని ఓ కారు బోల్తాపడింది. నర్సీపట్నం నుంచి విశాఖపట్నం వెళుతున్న కారు మండల కేంద్రంలోని బ్రాంది షాపు వద్దకు వచ్చేసరికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ కనిపించకపోవడంతో ఢీకొని బోల్తా పడింది. కారులో ఉన్న నలుగురూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కారును పక్కకు తీసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా తామరం జంక్షన్ నుంచి మాకవరపాలెం వరకు సుమారు కిలోమీరు మేర రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

విజయనగరం వరకే రాయగడ ఎక్స్‌ప్రెస్



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి రాయగడ-విజయనగరం సెక్షన్‌లో జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను జూన్ 2,3 తేదీల్లో రద్దు చేశారు. మరికొన్నింటిని గమ్యం కుదించడంతో పాటు రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు

- జూన్ 2న విశాఖపట్నం-కోరాపుట్-విశాఖపట్నం(58538 / 58537) పాసింజర్, విశాఖపట్నం-కోరాపుట్(18512) బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-రాయ్‌పూర్-విశాఖపట్నం(58528/58527) పాసింజర్
- జూన్ 3న కోరాపుట్-విశాఖపట్నం(18511) బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్

గమ్యం కుదించిన రైళ్లు

- జూన్ 1 గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. జూన్ 2 రాయగడ-గుంటూరు(17244) ఎక్స్‌ప్రెస్ విజయనగరం నుంచి బయలుదేరుతుంది.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

- జూన్1న ఎర్నాకుళం- టాటా (18190) ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 10.15 గంటలకు బయలుదేరుతుంది. అలప్పుజ-ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 8 గంటలకు బయలుదేరుతుంది.
- జూన్ 2న దుర్గ్-విశాఖపట్నం(20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 10.15 గంటలకు, విశాఖపట్నం-దుర్గ్(20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 4గంటలు ఆలస్యంగా రాత్రి 6.50 గంటలకు బయలుదేరుతుంది. ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లను రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని డీసీఎం సూచించారు.

'వికసిత్ భారత్'కు ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఎంపిక

అచ్యుతాపురం రూరల్: దేశీయ సాంకేతిక-వికసిత్ భారత్‌కు ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన ప్రాజెక్ట్‌లకు ఐఐటీ హైదరాబాద్‌లో 2024లో ప్రజెంటేషన్ నిర్వహించగా.. రాష్ట్రం నుంచి ప్రశాంతి కళాశాల ఎంపికైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు తార్కాణమే 'స్పెక్ట్రమ్'


విద్యార్థుల ఆవిష్కరణను తిలకిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖ విద్య: విద్యార్థుల అద్భుత ప్రతిభకు తార్కాణంగా 'స్పెక్ట్రమ్'ప్రదర్శన నిలిచిందని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం చిత్రకళ విభాగం బీఎఫ్ఎం, ఎంఎఫ్ఏ విద్యార్థుల వార్షిక చిత్రకళ ప్రదర్శన స్పెక్ట్రమ్- 2025ను శుక్రవారం వీసీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలు ఆయన తిలకించి అభినందించారు. విద్యార్థులు తమ అద్భుత ప్రతిభతో కళాఖండాలను తీర్చిదిద్దారని ప్రశంసించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిత్రకళ విభాగం విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ఒక ప్రత్యేక ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు తయారు చేసిన శిల్పాలు, చిత్రాలను నిశితంగా పరిశీలించి.. వాటి వెనుక ఉన్న భావాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీగా సర్పంచ్..


చినబొడ్డేపల్లిలో ఉపాధి పని చేస్తున్న సర్పంచ్ శివరామ్

కోటవురట్ల: అతనో గ్రామానికి సర్పంచ్. అయినా తెల్ల చొక్కా వేసుకుని ఊరకే కూర్చోలేదు. పని చేస్తేనే ఎవరికైనా ఆరోగ్యం, కుటుంబానికి ఆసరా ఉంటుందని భావించారు. నలుగురూ ఓ చోట చేరి పనిచేస్తే వారి మధ్య అనుబంధం, ఆత్మీయత పెరుగుతాయని తలంచారు. ఉపాధి హామీ పథకంలో ఓ కూలీగా జాబ్‌కార్డు తీసుకుని అందరితో పాటు తానూ పనిచేస్తూ ఆదర్శంగా నిలిచారు. అతనే చినబొడ్డేపల్లి గ్రామ సర్పంచ్ పైల శివరామ్. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో సర్పంచ్‌గా గెలిచారు. ఆనాటి నుంచి గ్రామ సమస్యలను పరిష్కరించడంలో చురుగ్గా వ్యవహరిస్తూ ఉపాధి హామీ పథకంలో చేరి నేటి తరం యువకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఉద్యోగం లేదని నిరాశ నిస్పృహలలో కుంగిపోకుండా అందుబాటులో ఉన్న ఏదొక పని చేసుకుంటూ గొప్ప స్థాయికి చేరుకునేందుకు మరింత ఉత్సాహంగా మార్గాలను వెతుక్కోవాలని సర్పంచ్ శివరామ్ చెబుతున్నారు.

'అవినీతిపరుడు కొండనాయుడుకు పదవి ఇవ్వొద్దు'


కొండనాయుడుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: అవినీతికి పాల్పడుతున్న టీడీపీ రావికమతం మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడితో పాటు అతని కుటుంబ సభ్యులకు మళ్లీ పదవి ఇవ్వొద్దంటూ పలువురు టీడీపీ నాయకులు నిరసన గళమెత్తారు. ఈ మేరకు శుక్రవారం రావికమతం మండలానికి చెందిన పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు వడ్డాదిలో టెంట్ వేసి రాజు నాయుడుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా కొండనాయుడు పార్టీ మండల అధ్యక్షుడిగా ఉంటూ అన్ని శాఖల అధికారులను గుప్పిట్లో పెట్టుకుని అవినీతికి పాల్పడున్నాడన్నారు. పలు గ్రామాల్లో భూ దందాలు చేయడమే కాక అధికారుల బదిలీల్లో డబ్బులు వసూలు చేస్తున్నాడని విమర్శించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలను బెదిరించి తాను చెప్పిన పనులు మాత్రమే చేయాలని, ఎమ్మెల్యే తరువాత సూపర్ ఎమ్మెల్యేని తానేనని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. తనకు మళ్లీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని ప్రయత్నాలు చేస్తున్నాడని, అవినీతికి పాల్పడుతూ పార్టీ పరువు తీస్తున్న కొండనాయుడు కుటుంబ సభ్యులకు ఎటువంటి పదవులు ఇవ్వొందంటూ పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు భర్నికాన అప్పారావు, వై.చినసత్తిబాబు, పి.శ్రీనుబాబు, ఎం.దేముళ్లు, పి.అప్పన్న, సిహెచ్.రాజునాయుడు, ఎస్.రాము, మలిచెట్ల నాగేశ్వరరావు, బాబూరావు తదితరులు నినాదాలు చేశారు. రాజునాయుడు అవినీతిపై పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబుకు, ఎమ్మెల్యే రాజుకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

కార్మికుల బకాయిలు చెల్లించాలని వినతి



ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న కోన లక్ష్మణ్

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు బకాయిపడ్డ మూడు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బకాయి పడ్డ జీతాలను ప్రభుత్వ జీవో ప్రకారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వడ్డాది ఈశ్వరరావు, వెంకటలక్ష్మి, బీఎల్ రాజు, ప్రసాద్, నవీన్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్‌ను అమలు చేయాలి



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి డిపోలో 1–2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ కార్యదర్శి జి. శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 91వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు ఆపాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎ. నాగేశ్వరావు, కె.ఎస్. రావు, బి.వి.ఎస్. రావు, ఎం. రావు తదితరులు పాల్గొన్నారు.

3న శ్రీకృష్ణ స్వామి ఆలయ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న శ్రీకృష్ణ స్వామి ఆలయం

అనకాపల్లి: మండలంలో మారేడుపూడి పంచాయతీ బీసీ కాలనీలో వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు గణపతి లక్ష్మి సమేత శ్రీకృష్ణ స్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఈగల కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆలయంలో విష్వక్సేనారాధనం, పుణ్యాహవచనం, అజస్ర దీపారాధన, రక్షాబంధనం, ఋత్విక్‌వరుణ్, మృత్సంగ్రహణం, అంకురార్పణ, వాస్తు పూజా, నవగ్రహ ఆరాధనం, తదితర పూజా కార్యక్రమాలతోపాటు స్వామివారి విగ్రహ ప్రతిష్ట, భారీ అన్నసమారాధన, గరిడి సేవ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 192 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,950
రెండో రకం	3,800	4,390
మూడో రకం	3,300	3,700

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
ఖలేజా	:సత్యనారాయణస్క్రీన్-1
కరాటే కిడ్-లిజెండ్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సింగిల్	:షిర్డీసాయి
ఏసీఈ	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
షష్టిపూర్తి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 10 యూనిట్లు, బీ పాజిటివ్ –5, ఓ పాజిటివ్ –24, ఏబీ పాజిటివ్ –6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

నిధులిచ్చి.. చేతులెత్తేసి!



పూడికతో నిండిన రేబాక ఊర చెరువు

ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు నీటి కష్టాలు తప్పవని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సాగునీటి కాలువలు, చెరువులు మరమ్మతుల కోసం కూటమి ప్రభుత్వం 20 రోజుల క్రితం కోటి రూపాయలు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. ఇంతలో అడపాదడపా కురుస్తున్న వర్షాలను బూచిగా చూపి పనులు చేయడం సాధ్యం కాదని చేతులెత్తేసింది. దాంతో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వేసవి ప్రారంభంలోనే నిధులు మంజూరు చేసి ఉంటే ఈపాటికి పనులు పూర్తయ్యేవని వాదన బలంగా వినిపిస్తోంది.

- వేసవి ఆరంభం నుంచి కాలయాపన
- వర్షాలు కురుస్తున్న సమయంలో రూ.కోటి మంజూరు
- చెరువుల అభివృద్ధికి వానలు ఆటంకం
- కూటమి ప్రభుత్వంపై రైతుల ఆగ్రహం

తుమ్మపాల: పూడిక తీయక పిచ్చిమొక్కలతో చెరువులు, సాగునీటి కాలువలు వెక్కిరిస్తున్నాయి. వీటి అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో నీరు చేరి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఏప్రిల్ నుంచి మొదలైన వానలు వారానికి కనీసం ఒక రోజైన కురుస్తూనే ఉండటంతో వేసవిలోను చెరువుల్లో నీరు చేరి వర్షాకాలాన్ని తలపిస్తున్నాయి. దీంతో చెరువుల్లో ఉపాధి హామీ పనులు కూడా ఈ ఏడాది జరిగే అవకాశం లేకుండా పోయింది. వారంతా కొండలు, వాగుల్లో పనులు చేస్తున్నారు. చెరువుల అభివృద్ధికి నివేదికలు గత ఏడాదిలో స్వీకరించిన ప్రభుత్వం ఈ ఏడాది వేసవి చివరిలో నిధులు మంజూరు చేయడంతో పనులు చేసే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

● అన్ని చెరువుల్లోను వర్షపు నీరు

ఈ ఏడాది వేసవిలో అడపాదడపా వర్షాలు కురవడంతో మండలంలో అన్ని గ్రామాల చెరువుల్లోను వర్షపు నీరు చేరి పదునుతో ఉన్నాయి. ప్రతి వారం వర్షం కురవడంతో చెరువులన్నీ పూడిక పేరుకుపోయి వాహనాలు వెళ్లలేని స్థితికి చేరుకున్నాయి. దాదాపు 20 ఏళ్లుగా చెరువుల సంరక్షణపై ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా గట్లు ధ్వంసమయ్యాయి. చెరువు గట్ల వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గేట్లు తుప్పుపట్టి దొంగల పాలయ్యాయి. మరికొన్ని ఇనుప గేట్లు తుప్పుపట్టి పాడయ్యాయి. చెరువుల నుంచి ఆయకట్టు భూములకు సాగునీరందించే కాలువలు పూర్తిగా పూడికతో నిండిపోయాయి. చెరువుల దుస్థితి అత్యంత దారుణమయ్యాయి.

● మంజూరైన రూ.కోటితో పనులు జరిగేనా....

చెరువులు, సాగు కాలువల రూపురేఖలు మార్చేసి ప్రతి ఎకరాకు నీరందించే బాధ్యత తీసుకుంటామన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా వాటి అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. గ్రామాల్లో కూటమి నాయకులు మాత్రం చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి విక్రయాలతో రూ.లక్షలు కూడేసుకుంటున్నారు. చెరువులు, వాగులను కప్పేసి నాలా చట్టానికి తూట్లు పొడుస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రోడ్లు వేసేస్తున్నారు. చెరువుల అభివృద్ధిపై మాత్రం కనీసం చొరవ చూపించడం లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ చెరువుల్లో పూడిక తీసి చక్కగా తయారు చేయడం ప్రస్తుత వాతావరణంలో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. నిధులు మంజూరై 20 రోజులు దాటుతున్నా, నియోజకవర్గంలో ఏ ఒక్క చోటా పనులు ప్రారంభం కాలేదంటే పరిస్థితి అర్థమవుతోంది.

చెరువుల పూడికతీత, అభివృద్ధికి నియోజకవర్గంలో మంజూరైన పనులు...

గ్రామం/మండలం	చెరువు/కాలువ	నిధులు (లక్షలు)
దిబ్బపాలెం	తుమ్మపాల కాలువ	రూ.10
మాకవరం	ఎర్రినాయుడు చెరువు	రూ.10
పి.సంతపాలెం	వీరన్న చెరువు	రూ.10
సిహెచ్‌ఎన్.అగ్రహారం	ధర్మసాగరం చెరువు	రూ.10
బట్లపూడి	ఎరకన్నదొర చెరువు	రూ.10
తగరంపూడి	తగరంపూడి కాలువ	రూ.10
తగరంపూడి	సీతనగరం కాలువ	రూ.10
రేబాక	ఊర చెరువు	రూ.9
కశింకోట	కశిమదుం	రూ.9
పేరంటాలుపాలెం	కాలువ	రూ.6
తేగాడ	వెదురుపర్తి కాలువ	రూ.6
మొత్తం		రూ.100

పనులు ప్రారంభించేలోపు వర్షాలు

నియోజకవర్గంలో మొదటి ప్రాధాన్యత కింద కొన్ని గ్రామాల చెరువులు, కాలువ పూడికతీత, గేట్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు గత వారమే సిద్ధమైనప్పటికి వర్షాలు ఆటంకం ఏర్పడింది. టెక్నికల్ అప్రూవల్ పూర్తి చేస్తున్నాం. పులి కాలువ పనులు ప్రారంభించాం. చెరువుల పూడిక పనులు ప్రారంభిస్తాం.

– ఏఈ అమూల్య, ఇరిగేషన్ శాఖ, అనకాపల్లి

యోగాతో ఆరోగ్య జీవనం



యోగాసనాలు చేస్తున్న విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్, ఉద్యోగులు



జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో యోగాసనాలు చేస్తున్న ఉపాధ్యాయులు



యోగా శిక్షణలో ఉద్యోగులు

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా నిత్య జీవితంలో ప్రతి వ్యక్తి ఒత్తిడికి గురవుతున్నాడని, నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని ఏపీఈపీడీసీఎస్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్ తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యుత్‌శాఖ ఉద్యోగులు శుక్రవారం యోగాసనాలు చేశారు. ఆయన మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల తర్వాత యోగాపై ఆసక్తి పెరిగిందన్నారు. ఉదయం లేదా సాయంత్రం సమయంలో రోజుకు గంట యోగా చేయాలన్నారు. యోగా చేయడం వల్ల వ్యాధులు బారి నుంచి విముక్తి కలుగుతుందన్నారు. అనంతరం యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో..

స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయులు యోగాసనాలు చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లెక్కల రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు వచ్చే నెల 21వ తేదీ వరకూ యోగాసనాలు చేస్తామన్నారు. యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: యోగా శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను ఆకలింపు చేసుకొని గ్రామాల్లో ప్రజలకు వివరించి అవగాహన కలిగించాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ కోరారు. స్థానిక పీఎసీఎస్ వద్ద ప్రైవేటు ఫంక్షన్ హాలులో సచివాలయాలు, మండల పరిషత్ సిబ్బందికి యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ వచ్చే నెల జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని గ్రామాల్లో యోగాపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. 200 మంది సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

కశింకోట: కలెక్టర్ విజయ కృష్ణన్ శనివారం కశింకోట రానున్నారు. ఇక్కడ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారని ఎంపీడీవో వీవీ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు 10,161 పింఛన్లను సచివాలయ, పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

2న టెన్త్ టాపర్లకు సన్మానం

అనకాపల్లి టౌన్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న టెన్త్ టాపర్లకు అభినందన కార్యక్రమం వచ్చే నెల 2న నిర్వహిస్తున్నట్లు పొట్టిశ్రీరాములు భవన్ నిర్వాహకుడు పిరాట్ల నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు భవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దారు కె. విజయ్‌కుమార్ తదితరులు హాజరై సన్మానిస్తారన్నారు.

కార్మికురాలి మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్

అనకాపల్లి టౌన్: ఎస్. రాయవరం మండలం గుడివాడ పంచాయతీ పరిధిలోని సాయి మెరన్ కంపెనీలో పనిచేస్తున్న ఒడిశా కార్మికురాలి మృతి పట్ల సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కంపెనీలో మృతి చెందిన వివరాలు యాజమాన్యం గోప్యంగా ఉంచడంతో అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలను బయట పెట్టాలన్నారు. మృతురాలి కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

రిజిస్ట్రేషన్‌తో చిరు వ్యాపారులకు మేలు

మాడుగుల రూరల్: ఉచిత ఉద్యమమ్ రిజిస్ట్రేషన్ ద్వారా చిరు వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. మాడుగుల వెలుగు కార్యాలయంలో శుక్రవారం వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్ బాక్స్‌లు

అనకాపల్లి: విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో గవరపాలెం పాత శంకర్ థియేటర్ రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్ బాక్స్ పిచ్చిమొక్కలతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారిలో నాలుగు ప్రైవేట్ స్కూళ్లు, ఒక జూనియర్ కళాశాల, కార్మిక శాఖ కార్యాలయం, పలు ఇళ్లు ఉన్నాయి. ప్రధాన రహదారి కావడంతో స్థానికులు, విద్యార్థులు, అధికారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయంభయంగా నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. కూతవేటు దూరంలో జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఉన్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడే సమయంలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందన్నారు.

కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణలపై చర్యలేవి?

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణలపై చర్యలేవని స్థానికులతో పాటు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందనలో వచ్చిన అర్జీని పూర్తిగా క్లోజ్ చేశారని సమాచార హక్కు చట్టం ప్రకారం శుక్రవారం తహసీల్దారు రమాదేవికి రామకొండలరావు, తదితరులు ఫిర్యాదు చేశారు.





చిన్నారి మానవిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రెండు గంటల్లో చిన్నారి ఆచూకీ లభ్యం

పెందుర్తి: ఆడుకుంటూ ఇంటి ప్రాంగణం నుంచి బయటకు వెళ్లిపోయిన మూడేళ్ల చిన్నారి ఆచూకీని పెందుర్తి పోలీసులు రెండు గంటల వ్యవధిలో కనిపెట్టారు. వివరాలివి.. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొగ్గవానిపాలేనికి చెందిన నకరాపు మానవి(3) గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా.. ఇంటి ప్రాంగణంలో ఆడుకుంటోంది. అయితే కొద్దిసేపటికి మానవి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కాలనీలో శోధించారు. దాదాపు రెండు గంటల తరువాత ఓ నిర్మానుష్య ప్రాంతంలో చిన్నారిని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

సాగులో యాంత్రీకరణ లాభదాయకం



రైతులతో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్

రావికమతం: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. యాంత్రీకరణతో వ్యవసాయం చేపట్టడం ద్వారా పని వేగం కావడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో దొండపూడి, జెడ్.బెన్నంవరం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖల సహకారంతో విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలను శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అందించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ భవాని మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో వివరించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పంట మార్పిడి వల్ల ఎర్రకుళ్లు, పశుపాక తెగుళ్లను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రూప, శాస్త్రవేత్తలు ఎస్.సత్తిబాబు, కిషోర్ కుమార్, కిరణ్‌కుమార్, వెంకటేషన్, సుగుణ, ఎం.విజేత, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.జగదీష్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

